

ఐటీఐ మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 5: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనరు టీవీ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వుందని, రిజిస్ట్రేషన్ అయిన తరువాత వచ్చిన యూనిక్ నెంబరుతో 27వ తేదీ వరకు సమయం ఉందన్నారు. 28 నుంచి 31 వరకూ కౌన్సెలింగు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 98491 18075, 98499 44654, 77806 58035 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్...(ఇన్‌సెట్)లో జిల్లా మంత్రి శ్రీనివాస్

సాగుపై కలెక్టర్ నివేదిక

కలెక్టరేట్, ఆగస్టు 5: అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ వివిధ అంశాల్లో జిల్లా పరిస్థితులను వివరిస్తూ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో వచ్చిన మార్పులను నివేదించారు. జిల్లాలో ప్రధాన పంటల దిగుబడి, జిల్లా ఆర్థిక అభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్రను వివరించారు. ఈ ఏడాది 3600 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం, 1500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. గనులు, మైనింగ్ ద్వారా 2023-24లో రూ.125 కోట్ల ఆదాయం జిల్లా నుంచి లభించగా 2024-25 సంవత్సరానికి రూ.135 కోట్లు రాబెట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాయగడ, రామభద్రపురం, చిలకపాలెం స్టేట్ హైవే, విజయనగరం-పాలకొండ రోడ్డును పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. అమరావతిలో జరిగిన సదస్సులో జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ కార్తీక్ వర్చువల్‌గా పాల్గొన్నారు.




సదస్సులో కలెక్టర్ అంబేడ్కర్



మెంటాడ: ఆండ్ర నుంచి కుంబివలస వెళ్లే రహదారి ఇలా

నడకా.. నరకమే



ఆండ్ర నుంచి జగన్నాథపురం వెళ్లే రోడ్డు

- ఏజెన్సీలో 108 వాహనం చేరుకోలేని గ్రామాలెన్నో
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- మైదాన ప్రాంతాల్లోనూ దయనీయం

మెంటాడ, ఆగస్టు 5: జిల్లాలో రహదారిద్ర్యం వల్ల గత ఐదేళ్లలో ఎన్నో కుటుంబాలు బాధితులయ్యాయి. మైదాన ప్రాంతాల్లో గుంతల్లో పడి తీవ్ర గాయాలై ప్రాణాలు పోగొట్టుకున్నవారు కొందరు కాగా.. కాలు, చేయి, నడుం విరిగి మంచం పట్టిన బాధితులు కోకొల్లలు. ఇక గిరిజన ప్రాంతాల్లో అయితే రోడ్డు లేక.. రాళ్లు, పొదల్లో నుంచి నడవడం ద్వారా ఆస్పత్రికి వెళ్లేసరికి మరింత ఆపత్కాలం ముంచుకొచ్చేది. గర్భిణుల ఆపసోపాలకు అంతే లేదు. అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేక డోలీని ఆశ్రయించి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆస్పత్రికి వెళ్తున్నారు.

- మెంటాడ మండలం కూనేరు పంచాయతీలో సీతగుండం నుంచి తిమిరివలస, పాతపాడు నుంచి దిగువ మిర్తివలస, ఆండ్ర నుంచి ఎగువ మిర్తివలస వరకు రహదారులు పూర్తిగా లేవు. నడకదారితో దశాబ్దాలుగా గిరిజనులు నెట్టుకొస్తున్నారు. సూదిరాళ్లకు పాదాలు కోసుకుపోయినా ప్రత్యామ్నాయ మార్గంలేక నరకం చూస్తున్నారు.
- ఆండ్ర, కుంబివలస గ్రామాల మధ్య రహదారిద్ర్యం దశాబ్దాల కాలంగా కొనసాగుతూ ఉంది. మెంటాడ చంపావతి నుంచి సారాడవలస మధ్య రోడ్డు దుస్థితి గురించి ఎంతతక్కువ చెప్పుకున్నా తక్కువే. ఆండ్ర నుంచి అనంతగిరి మండలం గరుగుబిల్లి వరకు సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు అధ్వానం. ఆండ్ర నుంచి గజపతినగరం వరకు బీటీ రోడ్డు గుంతలతో నిండి వాహనదారులు, పాదచారులకు చుక్కలు చూపిస్తోంది.
- లోతుగెడ్డ పంచాయతీ వేపగుడ్డి, కొండపర్తి గ్రామాలకు రహదారి లేక గిరిజనులు చంపావతి నది తెప్పలపై దాటుతుంటారు. పెద్దలు అందుబాటులో లేని సమయంలో విద్యార్థులే స్వయంగా తెప్పలను నడిపి కొండపర్తి పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు.



తెప్పపై చంపావతిని దాటుతున్న విద్యార్థులు(ఫైల్)

వర్షాకాలంలో భయంభయంగా..

వేసవి కాలంలో ఏదోలా నెట్టుకొస్తున్న గిరిజనులకు వర్షాకాలం వస్తే ప్రాణసంకటం మొదలవుతుంది. 108 వాహనం కూడా ఆయా గ్రామాలకు చేరలేని పరిస్థితి. ఆపత్కర సమయంలో డోలీయే వారికి గత్యంతరం అవుతోంది. ఆస్పత్రికి తరలించడంలో ఆలస్యం ఐతే ప్రాణాలు గాల్లో దీపాలే. రోడ్లపై ప్రసవాలైన ఘటనలెన్నో జిల్లాలో జరిగాయి. గత ఐదేళ్లలో వారి గోడు ఎవరూ వినలేదు. కూటమి ప్రభుత్వంపై గిరిజనులు గంపెడాశలు పెట్టుకున్నారు.

బాలకార్మికులుగా గిరి విద్యార్థులు

రహదారి సౌకర్యం లేక పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇష్టపడడం లేదు. కొందరు విద్యార్థులు పాఠశాల విద్య పూర్తయ్యాక ఆగిపోతున్నారు. ఆండ్ర, మెంటాడ, జీటీ పేట, చల్లపేట, జయతి ఉన్నత పాఠశాలలకు గిరిజన విద్యార్థులు వెళ్లిరావాలంటే దూరాభారంతో పాటు రాళ్లు, పొదల్లో నుంచి నడవాలి. రహదారి సౌకర్యం లేక విద్యార్థులు బాలకార్మికులుగా మిగిలిపోతున్నారు. ఈ రోడ్ల సమస్యపై పీడిక రాజన్నదొరకు ఎంతోమంది ఎన్నో సందర్భాల్లో, ఎన్నో వేదికల సాక్షిగా వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

ప్రయాణం.. ప్రమాదం

బొబ్బిలి, ఆగస్టు 5: బొబ్బిలి పట్టణం, మండలం పరిధిలో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులు చాలా అధ్వానంగా తయారయ్యాయి. వాటిపై ప్రయాణం అంటేనే జనం భయపడుతున్నారు. పారాది దగ్గర వేగావతి నదిపై పాత బ్రిడ్జికి సమాంతరంగా సుమారు కోటి రూపాయలతో తాత్కాలిక వంతెన నిర్మించినప్పటికీ అది ఏమాత్రం ప్రయాణాలకు ఉపయోగపడ లేదు. చిన్నపాటి వర్షాలకే కొట్టుకుపోయింది. బొబ్బిలి నుంచి పిరిడి, కారాడ, అలజంగి, గొల్లపల్లి వెళ్లే రోడ్లపై నడక కూడా నరకమే. వాహనదారులు గమ్యానికి చేరుకునేందుకు ప్రతిరోజూ ఆపసోపాలు పడుతున్నారు.



గుంతలతో గొల్లపల్లి బైపాస్ రోడ్డు

కదంతొక్కిన గిరిజనులు

- పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయింపు



కలెక్టరేట్ ముందు బైఠాయించిన గిరిజనులు

కలెక్టరేట్, ఆగస్టు 5: పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి..అటవీ శాఖ అధికారులు పెట్టిన తప్పుడు కేసులు ఎత్తి వేయాలి.. గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలి.. అంటూ గిరిజనులు కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించారు. ఎండను సైతం లెక్క చేయకుండా సోమవారం నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించారు. వారి ఆందోళనతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ టి.అప్పలరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనలకు పోడు పట్టాలు మంజూరు చేయాలని, పోడు సాగు చేస్తున్న గిరిజనులపై ఫారెస్టు అధికారులు పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి, దత్తిరాజేరు మండలాల్లో ఉన్న గిరిజనులకు విద్యుత్, మంచినీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఎస్.కోట మండలంలోని దారపర్తి పంచాయతీ లక్ష్మీపురంలో చాలా గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలిసి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానంద్ గిరిజనుల వద్దకు వచ్చి వారి మొర విన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పడంతో శాంతించారు.

అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి

- కొత్తవలసలో ఉమా జూట్ మిల్లు కార్మికుల ర్యాలీ

కొత్తవలస, ఆగస్టు 5 : తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో ఉన్న ఉమా జూట్ మిల్లులో గత నెల 15 నుంచి విధించిన అక్రమ లాకౌట్ ఎత్తివేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. జూట్‌మిల్లు కార్మిక సంఘం కార్యాలయం నుంచి కొత్తవలస తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ చేశారు. కొత్తవలస జంక్షన్‌లో కొద్దిసేపు మానవహారం నిర్వహించారు. కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్‌పాండా మాట్లాడుతూ జూట్ మిల్లులో 400 మంది కార్మికులు గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, గత సంవత్సరం నుంచి యాజమాన్యం కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, కార్మికుల నుంచి వసూలు చేసే పీఎఫ్, ఈఎస్‌ఐలను ప్రభుత్వం వద్ద జమ చేయడం లేదని అన్నారు. సుమారు 100 మంది కార్మికులు రిటైర్ అవ్వగా వారికి చెల్లించాల్సిన గ్రాట్యూటీ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌ఐ రాజేష్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎన్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

- బదిలీల కోసం నిరీక్షిస్తున్న సాధారణ ఉద్యోగులు
- రెండేళ్ల కిందట చేపట్టిన ప్రక్రియలో కొందరికే మేలు

కలెక్టరేట్, ఆగస్టు 5: రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొలిక్కి వచ్చాక ఆ తర్వాత స్థాయి ఉద్యోగుల బదిలీలు సాగుతున్న నేపథ్యంలో మిగతా వారు కూడా స్థానం మార్పు కోసం ఎదురు చూస్తున్నారు. ఐదేళ్లుగా ఒకేచోట ఉంటున్న వారు మరింత ఆత్రంగా ప్రభుత్వ నిర్ణయం కోసం నిరీక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తోంది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్, డీఎస్పీలు, తహశీల్దార్లు, సీఐలు బదిలీ అయ్యారు. ఇంకా జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు ఉండిపోయారు. వీరు సాధారణ బదిలీల కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రెండు సంవత్సరాలు క్రితం గత ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలను చేపట్టింది. అయితే అప్పటి పాలకులకు అనుకూలంగా ఉన్న పలువురు అధికారులు, సిబ్బంది కావాల్సిన చోటుకు బదిలీ చేసుకున్నారు. మిగతా వారిని ఎక్కడెక్కడికో విసిరేశారు.

ప్రస్తుత పరిస్థితిలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పని చేస్తున్న ఉద్యోగులు చాలా మంది బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఒకే చోట ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారు కూడా ఎక్కువ మందే ఉన్నారు. ప్రభుత్వం సాధారణ బదిలీలకు అవకాశం కల్పిస్తే స్థానాలు మారాలన్న ఆలోచనలో ఉన్నారు. కాగా విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ ఈనెల 24 వరకు అమలులో ఉంటుంది. దీనిపై ఎన్నిక కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేక కూడా రాసింది. ఈ పరిస్థితిలో సాధారణ బదిలీలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తాయా? లేదా? అనేదానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ప్రధానంగా గ్రామ స్థాయిలో పనిచేసే పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులను మార్పు చేసుకోవాలని ఇప్పుడు ఉన్న కూటమి నాయకులు భావిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఇప్పటివరకు ఒకేచోట పనిచేస్తున్నారు. వారిలో కొంతమందిని కూటమి నాయకులు మార్పు చేసుకోవాలన్న అభిప్రాయంలో ఉన్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



తప్పుదారిలో యువత

- రాజాంలో పెరుగుతున్న విష సంస్కృతి
- మత్తుపదార్థాలకు లోనవుతున్న వైనం
- పెరుగుతున్న గొడవలు.. కత్తులతో దాడులు

రాజాం రూరల్, ఆగస్టు 5: ప్రశాంతతకు మారుపేరైన రాజాం ప్రాంతంలో విషసంస్కృతి వేళ్లూనుకుంటోంది. మద్యం, గంజాయి ప్రభావంతో కొందరు యువకులు పెడదారి పడుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియని రీతిలో ఇతరులను ఇబ్బంది పెడుతున్నారు. కత్తులతో హల్‌చల్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో కిడ్నాప్ చేసి ఒకరిని దారుణంగా కొట్టిన ఘటన గతనెలలో జరగడం కలకలం రేగింది. ఏడాది కాలంలో రాజాం ప్రాంతంలో చోటుచేసుకున్న ఘటనల్లో కొన్ని పోలీస్‌స్టేషన్ వరకూ వస్తుండగా.. స్టేషన్ మెట్టెక్కనివి మరెన్నో.



యువకుడ్ని కిడ్నాప్ చేసి గాయపరిచిన ఘటనలో అరెస్టు అయిన నిందితులు(ఫైల్)

కొన్ని ఉదాహరణలు

- శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఓ యువకుడ్ని కిడ్నాప్ చేసి బట్టలూడదీసి కత్తితో బెదిరించి, కర్రలు, ప్లాస్టిక్ రాడ్లు, బెల్ట్ ఇతరత్రా మారణాయుధాలతో తీవ్రంగా గాయపరిచిన హృదయ విదారకరమైన సంఘటన గతనెల 25న అర్ధరాత్రి డోలపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వామ్యులైన 11 మంది యువకులపై హత్యాయత్నంతో పాటు మరిన్ని సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.
- గతంలో డోలపేటలో చెలరేగిన చిన్నపాటి వివాదం చినికి చినికి గాలివానలా మారి దాడికి దారితీసింది. దాడిలో రాజాం గొల్లవీధికి చెందిన రాము, శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. గంజాయి మత్తులో డోలపేటకు చెందిన బ్యాచ్ వీరిపై దాడికి పాల్పడినట్లు అప్పటి సీఐ గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ దాడిపై ఆగ్రహంతో ఉన్న మరో వర్గం కోపోద్రిక్తులై కత్తులతో హల్‌చల్ చేశారు. ఆ మరుసటిరోజున గొల్లవీధిలో సైతం కత్తులతో గలాటా సృష్టించారు.
- గతేడాది మే 3న రాజాం అంబేడ్కర్ జంక్షన్‌లో మద్యం మత్తులో కొంతమంది యువకులు కారులో వచ్చి అర్ధరాత్రి 12 దాటాక హడివుడి సృష్టించారు. ఆ మార్గంలో వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురిచేశారు.. వాహనాలపై రాళ్లు విసురుతూ అందరినీ టెన్షన్ పెట్టారు.
- గతేడాది జూన్ 24న మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బలిజిపేటకు చెందిన దేవరాజ్ బస్టాండ్‌లో పబ్లిక్‌గా బీరు తాగుతూ ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన దంపతులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో చంద్రరావు భార్య శైలజ గాయాలతో ఆస్పత్రి పాలైంది.
- గతేడాది జులై 15న రాజాంలో ఉంటున్న తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన కృష్ణ మాస్టర్‌ను రాజకీయ కక్షలతో అతి కిరాతకంగా కొట్టి చంపిన సంఘటన ఈ ప్రాంతంలో సంచలనం రేకెత్తించింది.. కేవలం రాజకీయ కుట్రకోణం ఈ హత్యకు ప్రేరణగా మారింది. కృష్ణమాస్టర్ బతికుంటే తమకు రాజకీయ ఎదుగుదల ఉండదన్న ఆలోచనతో కొంతమంది వ్యక్తులు కిరాతంగా కొట్టి, కళ్లు పొడిచి చంపేశారు.
- గతేడాది ఆగస్టు 28న రాత్రి డోలపేట మెయిన్‌రోడ్ సమీపంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో కత్తితో హల్‌చల్ చేశాడు. అప్పటి వరకూ పార్టీ చేసుకున్న ముగ్గురిలో ఏర్పడిన చిన్నపాటి విబేధాలు కత్తితో హల్‌చల్ చేసేందుకు దారితీశాయి. ముగ్గురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా తిరిగింది.
- గతేడాది ఆగస్టులో మండల పరిధిలోని గురవాం గ్రామానికి చెందిన నాయకుడు, రియల్టర్, వ్యాపారస్తుడు గొర్లె నారాయణరావుపై వంగర మండలం కొత్తపేటకు చెందిన, రాజాంలో నివాసం ఉంటున్న వ్యక్తి కత్తితో దాడి చేశాడు. నారాయణరావు ఇంటి సమీపంలో ఆయన రాకకోసం ఎదురుచూసిన ఆ వ్యక్తి, ఆయన వచ్చిన వెంటనే దాడిచేశాడు.
- గతంలో మున్సిపాలిటి పరిధిలోని డోలపేట మారుతినగర్‌లో ఓవ్యక్తిపై గంజాయి మత్తులో ముగ్గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారు. రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆ వ్యక్తి సంతకవిటి పోలీస్‌స్టేషన్ ఆశ్రయించినా పోలీసులు కేసు నమోదు చేయలేదు.

ఎందుకిలా..?

వివాదాలు, కొట్లాటలు, కత్తులతో దాడుల వెనుక ప్రధాన కారణం మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలే. రాత్రి పొద్దుపోయే వరకూ రాజాంలో బార్లు నిర్వహించడం, రాత్రి 12 గంటల వరకూ పాన్‌షాపులు తెరిచి ఉంచడం, వాటిలో మద్యం లభ్యం కావడం, అక్కడే మద్యం సేవించడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు గంజాయికి బానిస కావడం, వారి బలహీనతను ఆసరాగా చేసుకుని అరకు ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్మకాలు సాగించడం కూడా ఈ పరిస్థితికి మరో కారణం. రాత్రివేళ పోలీసుల గస్తీ తగ్గడంతో ఆకతాయిల్లో భయం పోయింది.

న్యాయపరంగా..

రాజాం ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టారు. న్యాయ అవగాహన సదస్సులు నిర్వహిస్తూ యువత పెడత్రోవ పట్టకుండా సూచనలు, సలహాలిస్తూ యువతను అప్రమత్తం చేస్తున్నారు.

దిక్సూచి DIKSUCHI

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్ధ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పోరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు



దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21. వెబ్‌సైట్: https://ibps.in/

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

4455 ఖాళీలు

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువ పత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/WP5N39qలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

అద్భుతమైన విజువల్స్‌తో 'చుట్టమల్లే'



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లె' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

పతాక సన్నివేశాల చిత్రీకరణ




అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్' లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా



విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలియకలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.



సినిమా చెట్టు నేలకు ఒరిగింది



గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్యగారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసే వారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.

ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్లుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర

ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్టు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది.



ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుపానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్థులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసరం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో ఆయా ఛానళ్లు క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- వ్యక్తిగత రక్షణ అధికారులను ఇవ్వాలి..
- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్



అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. '2019లో విశాఖ ఎయిర్ పోర్టులో నాపై కోడికత్తితో దాడి జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి కాకముందే నాకు ఉన్నత స్థాయి భద్రత కల్పించారు. నేను సీఎం అయ్యాక జడ్ ప్లస్ కేటగిరీ కింద 139 మందితో రక్షణ కల్పించారు. 2024 ఎన్నికల ఫలితాలు ప్రకటించి నెల గడవకముందే నాకున్న భద్రతా సిబ్బంది సంఖ్యను 59కి తగ్గించారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రక్షణ తగ్గించడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమే. ఎన్నికల ప్రచారంలో నాపై రాయితో దాడి చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

మూఢాలు పోయాయి... పెళ్లి ముహూర్తాలు వచ్చేశాయి

- రేపటి నుంచి 28 వరకూ...
- 11, 18 తేదీల్లోనే అత్యధిక పెళ్లిళ్లు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురుచూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. 'శుభ శ్రావణ మాసం.. శుభస్య శీఘ్రం' అంటూ పంతులు గారు మంచి రోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడు నెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్ర మాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారులకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడైతే ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10 రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18 తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్దశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి.

పశు, మత్స్య సంపద పెంచేందుకు చర్యలు చేపట్టాలి: ఎంపీ కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశు, మత్స్య సంపదను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పార్లమెంటులో అభ్యర్థించారు. భారతదేశం మొత్తమ్మీద ఏపీలో పశు సంపదకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెంపొందించేందుకు, పశు సంరక్షణ చర్యలు చేపట్టేందుకు బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏపీలో మైనింగ్ కార్యక్రమాలు ఎక్కువగా ఉండడం వల్ల పశువుల మేతకు ఆటంకాలు కలుగుతున్నాయన్నారు.

విశాఖ-జామి బస్సు సర్వీసులు నడపాలి

జామి: మండల కేంద్రమైన జామి నుంచి విశాఖపట్నం వరకు బస్సు సర్వీసులు నడపాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీవో తిరుమలరావుకు వినతిపత్రం అందించారు.

ఓపెన్‌స్కూల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్‌కు అవకాశం

రేగిడి: విద్యపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఓపెన్ స్కూల్ ద్వారా ఎస్సెస్సీ, ఇంటర్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఎంఈఓలు వర్రప్రసాదరావు, ఎరకయ్య తెలిపారు. మండలంలోని విద్యార్థులు రేగిడి హైస్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సోమవారం ఎంఈఓలు ఈ పాఠశాలను సందర్శించి అడ్మిషన్లపై స్థానిక హెచ్‌ఎం లక్ష్మణరావుతో సమీక్షించారు. పది, ఇంటర్ తప్పిన విద్యార్థులతో పాటు, 14, 15 ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు 27వ తేదీ ఆఖరి రోజని వెల్లడించారు.

ఎనిమిది కిలోల కణితి తొలగింపు

రాజాం రూరల్: స్థానిక ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో సోమవారం శస్త్రచికిత్స ద్వారా ఒడిశాకు చెందిన ఓ మహిళ కడుపులో నుంచి ఎనిమిది కిలోల కణితిని తొలగించారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ అందించిన సమాచారం ప్రకారం పూరి పట్టణానికి చెందిన ఓ మహిళ నాలుగేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నారు. కడుపులో ఉన్న కణితిని తొలగిస్తే ప్రాణాపాయం ఉందని కొంతమంది వైద్యులు చెప్పడంతో శస్త్రచికిత్సకు దూరంగా ఉంటూ బాధను అనుభవిస్తూ వచ్చారు. రాజాంలో నయమవుతుందని తెలుసుకుని ఇక్కడి ఆసుపత్రిలో చేరారు. ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డా.రాజేంద్ర వెల్లడించారు.

స్కూలు కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

వేపాడ: పాఠశాల విద్యాకమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంలను మండల విద్యాశాఖాధికారులు జి.జగదీశ్వరరావు, బాలభాస్కరరావు సూచించారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పాసు పుస్తకం ఇప్పించండి

బొబ్బిలి రూరల్: స్థారాది గ్రామానికి చెందిన రైతు శెట్టి వెంకటరమణ సోమవారం తన అనువంశిక భూమికి సంబంధించి మ్యూటేషన్ చేయించాలని, పాస్ పుస్తకం ఇప్పించాలని తహసీల్దారు ఎం.శ్రీనును కోరారు. చాలా రోజులుగా మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, అయినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్, వీఆర్వో, గ్రామస్థులు ఉన్నారు.

పీజీ విద్యను ఉచితంగా అందించాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 77ను రద్దు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు పీజీ విద్యను ఉచితంగా అందించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఆనంద కుమార్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ రాకుండా జీఓ నెంబరు 77ని ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేసిందన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సమయంలో అధికారంలోకి రాగానే జీఓ నెంబరు 77ని రద్దు చేస్తామన్నారని తెలిపారు. కానీ నేటికీ రద్దు చేయలేదన్నారు. తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, వంశీ, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికతీత పరిశీలన

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న కాలువల్లో పూడిక ప్రక్షాళన ప్రక్రియను కమిషనర్ ఎంఎం నాయుడు పరిశీలించారు. వీటీ అగ్రహారం, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పర్యటించి పేరుకుపోయిన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే 49 సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పౌర సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది పనితీరు మరింత మెరుగుపరుచుకుని ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

ఆర్‌ఎంపీకి పురస్కారం

విజయనగరం దాసన్నపేట: విజయనగరం ఆర్‌ఎంపీ అసోసియేషన్ ప్రతి నిధి గుంటుబోయిన భవానీకి రాణిరుద్రమదేవి పురస్కారంతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో కన్నతల్లి ఫౌండేషన్ ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఎంపీ కడియం కావ్య, కార్పొరేషన్ చైర్మన్ నర్సింగ్, ఆర్‌డీవో చంద్రశేఖర రెడ్డి ద్వారా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు మమ్ముల తిరుపతి రావు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, కార్యదర్శి పైడిరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బొబ్బిలి: పాతబొబ్బిలి జంక్షన్‌లో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఏఎస్ఐ జి.భాస్కరరావు ఆధ్వర్యంలో ఒడిశా, మక్కువ, పార్వతీపురం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలన్నిటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గంజాయి, అక్రమ మద్యం ఇతరత్రా నిషేధిత వస్తువులు రవాణాను అడుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

రాజాం రూరల్: విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా వారి జీవితాలలో వెలుగులను నింపవచ్చని రొటేరియన్, ప్రభావతి, జాగృతి ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఆప్తాలమిక్ ఆఫీసర్ సప్పటి వసంతరావు పేర్కొన్నారు. పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆయన కంటి పరీక్షలు నిర్వహించారు. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అధిక వినతులు

- స్వీకరించిన డీఆర్వో, ఉపకలెక్టర్లు
- అర్జీలు సమర్పించేందుకు ఇబ్బంది పడిన అర్జీదారులు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో అనిత

కలెక్టరేట్: స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూసమస్యలపై అధికంగా వినతులు వచ్చాయి. డీఆర్వో అనిత, ప్రత్యేక ఉపకలెక్టర్లు మురళీకృష్ణ, సుమబాల తదితరులు వినతులు స్వీకరించారు. మొత్తం 265 వినతులు రాగా, వాటిలో 130 వినతులు భూ సమస్యలే ఉన్నాయి. వీటిని మండల స్థాయిలో తహసీల్దార్లు పరిష్కారం చేయాల్సి ఉంది. అయితే మండల స్థాయిలో పరిష్కారం కాకపోవడం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లి వినతులు అందిస్తున్నారు. ఇక్కడకు వచ్చిన అర్జీదారులు తమ వినతులను అధికారులకు అందజేయడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా పింఛన్లు మంజూరు చేయాలని 87 మంది, విద్యాశాఖకు 4, మున్సిపాల్టీకి 10, విద్యుత్ శాఖకు 8, గృహ నిర్మాణానికి 1, పంచాయతీ రాజ్ 12, గ్రామ వార్డు సచివాలయంలో 6, వైద్య ఆరోగ్య శాఖకు 5, డీసీహెచ్‌ఎస్ 2 వినతులు వచ్చాయి. ● గత ప్రభుత్వ హయాంలో కస్టమ్ హైరింగ్ సెంటర్లకు ఇచ్చిన యంత్రాల అద్దె ధరల సమాచార పట్టిక రైతు సేవా కేంద్రాల్లో ఉంచాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు బి.రాంబాబు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రైతులకు సరసమైన ధరకు పరికరాలను అందజేయాలని కోరారు. చాలాచోట్ల కస్టం హైరింగ్ సెంటర్లు పొందిన గ్రూపులు వాటిని వ్యక్తిగతంగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ● విజయనగరం పురపాలక శాఖ ఆధ్వర్యంలో 2017లో ద్వారపూడి కొండపై ఏర్పాటు చేసిన సోలార్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలని పలువురు టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఈ సోలార్ ప్లాంట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద నిరసనల హోరు

పలు సమస్యలకు పరిష్కారాలు కోరుతూ పలు సంఘాలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజనులు, రైతులు, విద్యార్థులు.. ఇలా పలు సంఘాలు హాజరై ధర్నాలు, నినాదాలతో నిరసన ప్రదర్శనలు చేశారు.

● గత ప్రభుత్వం హయంలో పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ రానివ్వకుండా ఇచ్చిన జీవో 77ను వెంటనే రద్దు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలో 50 రోజులు కావస్తుందని, వెంటనే జీవోను రద్దు చేయాలని కోరారు.

● కార్మికుల హక్కును కాలురాస్తున్న నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మిల్లు యాజమాన్యం నార కొరత కారణంగా మిల్లును ఆపివేసినట్లయితే ముందుగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. మిల్లులోని యూనియన్లతో లేదా కార్మికులతో సమావేశం జరిపి తెలియజేయాల్సి ఉంది. కాని ఇవేవీ పాటించకుండా తనకు నచ్చినట్లుగా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

● జిల్లాలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలంటూ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఎల్.కోటలో 16 మంది వీవోలను, గంట్యాడలో గ్రీన్ అంబాసిడర్లను, డెంకాడలో మధ్యాహ్న భోజనకార్మికులను తొలిగించారని ఆరోపించారు. వారందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలలు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- అదనపు ఎస్పీ అష్మాపరహీన్



సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ

విజయనగరం క్రైం: పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ అష్మాపరహీన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, 35 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు. 35 ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలకు సంబంధించి 8, భూతగాదాలకు సంబంధించి 17, మోసాలపై మూడు, ఇతర విషయాలకు సంబంధించి ఏడు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులు వాస్తవమైతే చర్యలు చేపట్టే విధంగా అధికారులను ఆదేశించామన్నారు. స్వీకరించిన ఫిర్యాదులను ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ నర్సింహమూర్తి, మురళి, ఎస్ఐలు మురళి, గణేష్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుతోనే సామాజిక న్యాయం: కోండ్రు



మాట్లాడుతున్న కోండ్రు

రాజాం, ఆగస్టు 5: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో పలు సామాజిక వర్గాల నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. రాజాం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల్ని పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడి సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి పెట్టుబడులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారని గుర్తు చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



బాలికల కబడ్డీ పోటీలు

శృంగవరపుకోట రూరల్: ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం ఆటల పోటీలు ప్రారంభించారు. పీడీలు శ్రీరాములు, కృష్ణ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు

సాలూరు రూరల్: శివరాంపురం పీఏసీఎస్ వద్ద యూరియాకోసం రైతులు సోమవారం బారులుతీరారు. నాట్లు వేసే సమయంలో యూరియా చల్లాల్సిఉంది. దీంతో సోమవారం స్టాక్ వచ్చిన కొద్ది గంటలకే రైతులు తీసుకువెళ్లారు. సాలూరు పరిధిలో నాలుగు పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిలో సాలూరు పీఏసీఎస్‌కు ఎరువులు విక్రయానికి లైసెన్స్, జీఎస్టీ అనుమతి లేదు. మామిడిపల్లి పీఏసీఎస్‌కు లైసెన్స్ ఉన్న జీఎస్టీ అనుమతి లేదు. పెదపథం పీఏసీఎస్‌కు జీఎస్టీ అనుమతి ఉన్న లైసెన్స్ లేదు. జీఎస్టీ, లైసెన్స్ ఉన్న శివరాంపురం పీఏసీఎస్‌కు 24 టన్నుల యూరియా, మరో 20 టన్నుల డీఏపీని రైతుల సౌకర్యార్థం ఏవో అనురాధ పండా రప్పించారు. స్టాక్ వచ్చిన కొద్ది గంటలకే యూరియాను రైతులు కొనుగోలుచేసి తరలించారు.దీంతో మరో 12 టన్నుల యూరియా శివరాంపురం పీఏసీఎస్‌కు రానుందని ఏవో అనురాధ పండా తెలిపారు. మంగళవారం 60 టన్నుల యూరియా సాలూరు అర్బన్,రూరల్‌కు రానుందని ఏవో చెప్పారు. అన్నమరాజువలస ఆర్బీకేలో పది టన్నుల సిద్ధంగా ఉందని తెలిపారు.

రెండు భాషల్లో బోధన అవసరం



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో రెండు భాషలు బోధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అరసాడ జెడ్పీలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యా యులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంబోతుల రమణ, జగదీశ్వరి, పల్ల మురళి, ప్రసాద్, తిరుపతి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



బొబ్బిలిలో..

వేపాడ: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని సోంపురం ఆరోగ్య కార్యకర్త జె.వెంకటలక్ష్మి అన్నారు. అరిగిపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుల్ల సన్యాసిరావు, అంగన్‌వాడీ కార్యకర్త కనక మహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పార్థసారథి, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

● బొబ్బిలి: బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం పట్టణ పరిధిలోని గొల్లపల్లి పదో వార్డులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కౌన్సిలర్ కాకల గోవిందమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అలజంగి గ్రామంలో సోమవారం బొబ్బిలి ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు ఘనంగా సీమంతాలు చేశారు. గర్భిణులు తీసుకోవలసిన జాగ్ర త్తలపై అవగాహన కల్పించారు.

బోల్‌భం భక్తుల కావడి యాత్ర



పణుకువలస ఆలయం వద్ద బోల్‌భం భక్తులు

సాలూరు రూరల్: ఒడిశాలోని బోల్‌భం భక్తులు శ్రావణ సోమవారం పురస్కరించుకుని ఏవోబీలోని కొండలు, కోనలు దాటుకుని కావడియాత్రను నిర్వహించారు. శ్రావణ మాసంలో సోమవారం ఒడిశా వాసులకు పవిత్రమైన రోజు. ఆ రోజున పూజించిన పవిత్ర జలం శివునికి అభిషేకించడం వారి ఆచారం. దీంతో ఏవోబీలో పొట్టంగి బ్లాక్‌లో సుంకి, లావుడి తదితర గ్రామాలకు చెందిన ఒడిశా భక్తులు 35 మంది ఏపీలో సాలూరు పంచముఖేశ్వరాలయానికి బోల్‌భం కావడియాత్రను చేశారు. 30 కిలోమీటర్లు పైబడి ఒడిశా నుంచి నడిచి ఆలయానికి చేరుకుని శివునికి పవిత్ర జలాలతో అభిషేకించారు.

కబ్జా భూమిలో బోర్డులు పాతిన రెవెన్యూ సిబ్బంది



ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డులు పాతిన రెవెన్యూ సిబ్బంది

లక్కవరపుకోట, ఆగస్టు 5: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో సోమవారం రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు పాతారు. 'వేసిన ఒక్కరోజులోనే పీకేశారు' అనే శీర్షికన కథనం సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వెలువడింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పాతారు. తామరాపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 3,11,12,13లలో గల ప్రభుత్వ గెడ్డ ఆక్రమణకు గురైంది. దీనిపై అధికారులు స్పందించి శనివారం హెచ్చరిక బోర్డులు వేశారు. వాటిని ఆక్రమణదారులు ఆదివారం పీకిపారేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఆర్ఐ సన్యాసిరావు, వీఆర్వో ఈశ్వరరావు సోమవారం బోర్డులు పాతి రైతులకు హెచ్చరిక జారీ చేశారు. అతి క్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు.

రాత్రి విధులు వీఆర్ఏ వ్యవస్థకు విరుద్ధం

వేపాడ: రెవెన్యూ కార్యాలయాలలో రాత్రిపూట వీఆర్యేలకు వేస్తున్న విధులు ఆ వ్యవస్థకే విరుద్ధమని ఆ సంఘ నాయకుడు గట్టు వెంకన్న అన్నారు. సర్వీసు రూల్స్, నిబంధనలకు విరుద్ధంగా వీఆర్ఎలతో రాత్రి విధులు నిర్వహింపజేయడం తగదన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్ ఇవ్వాలని, తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయాలన్నారు. రాత్రి విధులకు సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ సన్యాసినాయుడుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

కొత్తవలస: సర్వీసు రూల్స్ నిబంధనలకు వ్యతిరేకంగా వీఆర్ఏలతో రాత్రి వేళల్లో డ్యూటీలు చేయించడం చట్ట విరుద్ధమని, వెంటనే ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలని మండలానికి చెందిన వీఆర్ఏలు డిమాండ్ చేశారు. సోమవారం మండలానికి చెందిన వీఆర్ఏలు కార్యాలంలో ఆర్ఐ రాజేష్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందచేశారు. అర్హులైన వారందరికీ వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు తులసి, రూప, భవానీ, అప్పారావు, లక్ష్మి, బంగారమ్మ, శ్రీనివాసరావు, నారాయణ, పైడితల్లి ముత్యాలమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన



బొబ్బిలి రూరల్: నాటే విధానాన్ని చూపుతున్న దృశ్యం

లక్కవరపుకోట: మండలంలో ఎండిపోయిన నారుమడులను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. సోమవారం కొత్తవలస వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి ఎల్.విజయ, మండల వ్యవసాయాధికారి ఎం.స్వాతి, కల్లేపల్లి, గంగుబూడి గ్రామాల్లో పర్యటించి నారుమళ్లను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: జగన్నాథపురం గ్రామంలో సోమవారం రైతు సూర్యనారాయణ పొలంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు రైతులకు వరిపంట వరుసలలో నాటే విధానాన్ని, దీని ప్రయోజనాలను వివరించారు. ఈ పద్ధతిలో నాట్లు వేసుకోవడం వల్ల ఖర్చు తగ్గుతుందని.. అధిక దిగుబడి వస్తుందని తెలిపారు.

శృంగవరపుకోట రూరల్: వరి పంట వేసే రైతులు కాలిబాటలు వేసుకుంటే ఎంతో మేలు చేస్తాయని మండల వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. సోమవారం వినాయకపల్లి గ్రామంలో కాలి బాటలు తీయించారు. కార్యక్రమంలో వీఏఏ రవిచంద్ర, ఏపీసీఎఎఫ్ సిబ్బంది కోటి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులేటర్లు పాడై సాగునీటికి ఇక్కట్లు

- సాయన్న చానల్ రైతుల్లో ఆందోళన



సంకిలి మందపూని వద్ద హెడ్‌పాడైన పరిస్థితి

రేగిడి: సాయన్న చానల్, దాని అనుబంధ కాల్వల్లో రెగ్యులేటర్ల వ్యవస్థ పాడై సాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఆయకట్టు రైతులు అధికారులకు ఫిర్యాదుచేస్తున్నా ఫలితం కనిపించడం లేదని చెబుతున్నారు. చెలిగానవలస, సంకిలి వద్ద సాయన్న చానల్ హెడ్‌సిస్టమ్ ఉంది. ప్రధాన మొగ చెలిగానవలస వద్ద ఉండగా, సంకిలి వద్ద పెద్దపూని, తిరుగుడుపూనిల ద్వారా రేగిడి, సంతకవిటి మండలాల్లో దాదాపు 11వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. సంకిలి, చెలిగానవలస, రేగిడి వద్ద ఆరుచోట్ల రెగ్యులేటర్ వ్యవస్థ ఉంది. ప్రస్తుతం ఈ రెగ్యులేటర్ల తలుపులు పాడయ్యాయి. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో వేసిన ఐరన్ తలుపులు కావడంతో తుప్పుపట్టి పాడవడంతో వరదలకు కొట్టుకుపోయాయి. దీంతో దాదాపు 20 గ్రామాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో వంశధార షట్టర్ల కుంభకోణం వెలుగు చూడటంతో కొత్తగా మంజూరు చేయలేదని ఇరిగేషన్ అధికారు లు చెబుతున్నారు. దీంతో రైతులు అక్కడక్కడా కర్రలు అడ్డుపెట్టుకుని నీటిని తిప్పుకుంటు న్నారు. దీని పై ఇరిగేషన్ ఏఈ రాజేష్‌ను వివర ణ కోరగా.. దీనిపై ప్రభుత్వానికి నివేదించామని, నిధులు మంజూరైన వెంటనే పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

పోక్సో కేసులో 20 సంవత్సరాల జైలు

భోగాపురం, ఆగస్టు 5: పోక్సోకేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష పడింది. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా మునగపాక మండలానికి చెందిన బాలిక మండలం ఓ కళాశాలలో బి.పార్మశీ చదువుతూ స్నేహితులతో కలిసి అద్దె గదిలో నివాసముంటోంది. ఆమెకు ఫేస్ బుక్ ద్వారా పార్వతీపురం పట్టణం కొత్తవలసకు చెందిన పగడసాయి మనోజ్ కుమార్ పరిచమయ్యాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడు. ఆ తర్వాత పెళ్లికి నిరాకరించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన విద్యార్థిని 2020లో భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి డీఎస్పీలు బి.మోహన రావు, పి.వీరాంజనేయరెడ్డి దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ పూర్తి అయ్యే విధంగా భోగాపురం సీఐ ఎ.రవికుమార్ చర్యలు చేపట్టగా నిందితుడు పగడ సాయి మనోజ్‌కుమార్.. బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువైంది. దీంతో విజయనగరం పోక్సో స్పెషల్ న్యాయమూర్తి కె.నాగమణి నిందితుడికి 20 సంవత్సరాలు కఠినకారాగార శిక్ష, రూ.5500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజాం రూరల్: రేగిడి మండలం తోకలవలస గ్రామ సచివాలయంలో గతనెల 31న రాత్రి జరిగిన చోరీకి సంబంధించిన కేసులో ఇద్దరిని అదుపులోనికి తీసుకుని అరెస్ట్ చేసినట్లు చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. వారిద్దరి నుంచి ప్రభుత్వానికి చెందిన 16 సెల్‌ఫోన్లు, లామినేషన్ మెషిన్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రాజాం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం రూరల్ సి.ఐ.శ్రీనివాస్, రేగిడి ఎస్.ఐ. శ్రీనివాసరావుతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తోకలవలస గ్రామానికి చెందిన సంతోష్, రాంబాబు వీటిని చోరీ చేసినట్లు వారివేలిముద్రల ద్వారా గుర్తించామని తెలిపారు. మూడురోజుల్లో నిందితులను గుర్తించిన సీఐ శ్రీనివాస్, ఎస్.ఐ. శ్రీనివాసరావులను డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి అభినందించారు.

ఇసుక స్టాకు పాయింట్ పరిశీలన



ఇసుక స్టాకు పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటరులో గల ప్రభుత్వ ఇసుక స్టాకు పాయింట్‌ను సోమవారం సాయంత్రం తహసీల్దారు ఎం.శ్రీను పరిశీలించారు. ఇసుక అమ్మకాలను పారదర్శకంగా నిర్వహిం చాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, సిబ్బంది ఉన్నారు.

బాధితులకు పరామర్శ



డి.గదబవలసలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బేబీనాయన

తెర్లాం: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం పలువురిని పరామర్శించారు. జావాన రామినాయుడు ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. అరసబలగకు చెందిన కొరగంజి తిరుపతిరావు అనారోగ్యంతో బాధ పడుతుండడంతో పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేష్, సర్పంచులు కొరగంజి సాయిరాం, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును పునఃసమీక్షించాలి



నిరసన తెలియజేస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

రాజాం రూరల్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద నియోజకవర్గ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిరసన చేపట్టారు. నాలుగు మండలాలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయ కులు, నిరుద్యోగ యువత, కార్మిక సంఘాల ప్రతినిధులు, మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు జరజాన నీలయ్య, జానకిరాం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనసేన సభ్యత్వ నమోదులో ప్రత్యేకత

బొబ్బిలి: జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియలో బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ శ్రేణులు తమ ప్రత్యేకతను చాటుకున్నారని ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు ఐదువేల సభ్యత్వాల మైలు రాయిని దాటడానికి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. సోమవారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పలస్వామి మాట్లాడారు. పారాదికి చెందిన వీరమహిళ బంటుపల్లి దివ్య వందకుపైగా సభ్యత్వాలను నమోదు చేయించారని తెలిపారు. ఆమెకు పార్టీ అధిష్ఠానం ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత పెదింటి మనోజ్ కుమార్ (బాబీ), బంటుపల్లి దివ్య, ధనంజయ్, పైల హరి, చిక్కాల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం రూరల్: జనసేన వైపు యువత ఆకర్షితులవుతున్నారని ప్రచార కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు తెలిపారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న శిబిరం ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకూ రాజాం నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వాల సంఖ్య అయిదు వేలకు చేరిందన్నారు. సోమవారం ఒక్కరోజే 700 మంది క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్నారని వివరించారు.

భోజనానికి దాతల సహకారం

బాడంగి: బాడంగి జెడ్పీ పాఠశాలలో శుభతిథి భోజనానికి దాతలు, గ్రామ పెద్దల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యనారాయణను దాతలు కలుసుకొని తిథి భోజనంలో కొన్ని ఆహార పదార్థాలు తాము పెడతామని, అవకాశం కల్పించాలని కోరుతున్నారు. మూడు రోజులు ముగ్గురు దాతలు సాయమందించారు. 500 మంది పిల్లలకు శుభతిథి భోజనంలో పండ్లు, స్వీట్లు వంటివి పెట్టడానికి ఒక్కొక్కరు రూ.3వేల చొప్పున ఖర్చు చేశారు.

రైతుల శ్రేయస్సుకు కృషి


గడిగెడ్డనీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు మేలు చేసే విధానాలను రూపకల్పన చేస్తారని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని తాతవారి కిట్టలి గ్రామం సమీపంలో ఉన్న గడిగెడ్డ రిజర్వాయర్ నుంచి ఆయన సోమవారం సాగునీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జలాశయం సుమారు 2,900 ఎకరాలకు సాగునీరు అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం సాగునీరు తక్కువగా ఉందని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కుడి, ఎడమ కాలువలు పూర్తిగా సుమారు 15 గ్రామాలకు సాగునీటిని అందించే కాలువలను పూర్తిగా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. పూడికతీత పనులు కూడా ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల శాఖాధికారులు తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, టీడీపీ నాయకులు త్రిమూర్తులురాజు, సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, సీహెచ్ మహేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, దుర్గాసి కోటేశ్వరరావు, దాసరి శివప్రసాద్, రామునాయుడు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, నాగులపల్లి నారాయణరావు, ఎంపీటీసీ జోగినాయుడు, సోమినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కళా వెంకటరావు సోమవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు రాజు, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జడ్పీటీసీ అప్పలనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సన్యాసినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు సమస్యలను పరిష్కరించాలి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మిల్లు ఇఫ్టూ కార్మిక సంఘం నాయకులు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈమేరకు ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత, జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలసూరి తదితరులు సోమవారం నెల్లిమర్లలోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి, ఆమెకు వినతిపత్రం అందజేశారు. మిల్లు యాజమాన్యం తరుచూ కుంటి సాకులు చెబుతూ మిల్లును మూసివేస్తున్నదని చెప్పారు. కార్మికులకు రావాల్సిన గ్రాట్యుటీ బకాయిలను చెల్లించడం లేదని, పీఎఫ్ ఖాతాకు తమ సొమ్ము జమచేయలేదని వారు వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి, మిల్లు కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని ఇఫ్టూ నాయకులు చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నామాల తిరుపతిరావు, తివనాని అప్పారావు, పడాల జయమ్మ ఉన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

రాజాం: రాజాంలోని ప్రభుత్వ ఐటీఐలోని వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్ల భర్తీకి మూడో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తరువాత సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు ఒకటి నుంచి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రంతో ఈనెల 27న హాజరై వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 29న కౌన్సిలింగ్ అడ్మిషన్ నిర్వహిస్తామని చెప్పారు. వివరాల కోసం 90000 96048 నెంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

10న వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నెల్లిమర్ల: అనకాపల్లిలో ఈనెల 30 నుంచి జరుగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు ఈనెల 10వ తేదీన నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలను చల్లా రాము వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బెల్లాన లక్ష్మీనరేంద్ర, కార్యదర్శి చల్లా రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపిక పోటీలకు హాజరు కాగోరే క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ గుర్తింపు కార్డును, గూగుల్‌ఫారంను తీసుకుని హాజరు కావాలన్నారు.

భూములకు పట్టాలివ్వండి


ఆందోళన చేస్తున్న ఎస్టీకొత్తవలస గ్రామస్థులు

దత్తిరాజేరు: కొండపోడు భూములకు పట్టాలు అందించాలని ఆర్.రామచంద్రపురం పంచాయతీ ఎస్టీకొత్తవలస గ్రామానికి చెందిన గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. గత 20 ఏళ్లగా సాగుచేస్తున్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు కోరినా స్పందించలేదన్నారు. తక్షణమే పట్టాలు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ఎస్టీ వలస గ్రామస్థులు పాల్గొన్నారు.

లేత వరినారుతో అధిక దిగుబడి

డెంకాడ: లేత వరినారు నాటడం వల్ల రైతులు అధిక దిగుబడిని పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి పూడి నిర్మల తెలిపారు. డెంకాడలో కె.రమణ పొలాన్ని ఆమె సోమవారం సందర్శించారు. రైతు మూడు ఎకరాల్లో ఎన్‌టీయూ 1121 రకాన్ని మిషన్ ట్రాన్స్ ప్లాంటింగ్ ద్వారా 19 రోజులు నారును ఉడిచారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ లేత నారు నాటడం వల్ల పిలకల సంఖ్య పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. వీఏఏ అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీ విజేతలకు బహుమతులు

నెల్లిమర్ల: పారసాం గ్రామంలో గత రెండు రోజుల పాటు జరిగిన సంగంరెడ్డి జగదీష్ స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో కొండకరకాం జట్టు ప్రథమ విజేతగా నిలవగా, విజయనగరం రాజీవ్ స్టేడియం జట్టు ద్వితీయ స్థానం, ఎంఆర్ స్టేడియం జట్టు తృతీయ, ముద్దూరు జట్టు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ నగదు బహుమతులను, షీల్డులను అందజేశారు. సర్పంచ్ గొలజాన నారాయణరావు, ఎంపీటీసీ సంగంరెడ్డి జగన్నాథం, మాజీ సర్పంచ్ తర్లాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం


హర్షం వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీ ఎస్) సుమారు 30 ఏళ్ల పాటు సాగించిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎంఆర్‌పీఎస్ జిల్లా రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు బోని శ్రీను మాదిగ అన్నారు. సోమవారం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు 59 కులాల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం


పిల్లకాలువను శుభ్రం చేస్తున్న రైతులు

బొబ్బిలి రూరల్: ఎం.బూర్జవలస గ్రామంలో సోమవారం జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు ఎస్.గోపాలం ఆధ్వర్యంలో రైతులు తమ పొలాల్లో సాగు నీటి కోసం శ్రమదానం చేశారు. పిల్ల కాలువలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. గ్రామ సమీపంలో ఉన్న చెరువు నుంచి పిల్ల కాలువ ద్వారా పొలాలకు సాగునీరు రావలసి ఉంది. అధికారులు ఉపాధి హామీ పథకంలో ఈ పనులను చేర్చకపోవడం వల్ల రైతులు చేయవలసి వచ్చిందని గోపాలం అన్నారు. ఉపాధి హామీ పథకంలో నిధులు కేటాయించి ఈ పనులు చేపట్టాలని కోరారు.

జీవో 117ను రద్దు చేయాలి

- విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నాయకుల ఆందోళన
- మండలాధికారులకు వినతి

జీవో నెం.117ను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాలోని పలుచోట్ల స్థానిక అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను ఒక కిలో మీటర్ లోపు ఉన్న యూపీ, ఉన్నత పాఠశాలల్లో మెర్జ్ చేయడం వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా దెబ్బతిన్నదని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఉండాలని కోరారు. (ఆంధ్రజ్యోతి బృందం)


గంట్యాడ: ఎంఈవోకి వినతిపత్రం అందజేత


గరివిడిలో..


కొత్తవలస: ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు


శృంగవరపుకోట: తహసీల్దార్‌కు వినతి..

సమస్యలు పరిష్కరిస్తాం

- మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు సమర్పించిన అర్జీదారులు

జిల్లాలోని మండల కేంద్రాల్లోగల ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన లభించింది. పలువురు వివిధ సమస్యలపై కార్యాలయాల వద్దకు వచ్చి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీఇచ్చారు.

లేఅవుట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: ముషిడిపల్లి గ్రామ పరిధిలోగల డీపట్టా, చెరువు స్థలంలో రోడ్డు ఏర్పాటుచేసిన లేఅవుట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో జరిగిన గ్రీవెన్స్‌లో వారితో పాటు సంబంధిత డీపట్టాదారుడు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.

స్థలాలు అప్పగించండి

భోగాపురం: తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ ఇప్పటివరకు స్థలాలు అప్పగించలేదని తూడెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు వాపోయారు. ఈ మేరు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జలజీవన్ మిషన్ బిల్లులు నిలుపుదల చేయండి

జలజీవన్ మిషన్ పనులు భోగాపురం మండలంలో అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారని, సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు నిలుపుదల చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.చంద్రకళకు వినతిపత్రం అందజేశారు.

నగరపాలక సంస్థకు తొమ్మిది వినతులు

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కారవేదికకు తొమ్మిది వినతులు వచ్చాయి. కమిషనర్ ఎంఎం నాయుడు ఈ వినతులను స్వీకరించారు. టౌన్ ప్లానింగు విభాగానికి-2, ఇంజినీరింగు విభాగానికి-4, శానిటేషన్‌కు-2, రెవెన్యూకి సంబంధించి-1 చొప్పున వినతులు అందాయి. వినతులు స్వీకరించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏసీపీ అమ్మాజీరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


భోగాపురం: తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న తూడెం గ్రామస్థులు


విజయనగరంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కమిషనర్

శ్మశాన వాటికను ఏర్పాటు చేయించండి

జామి: జామి ప్రజలకు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులతో శ్మశానం లేకుండా పోయిందని.. ఈ సమస్య పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకటత్రివేణి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గడిచిన రెండేళ్లుగా జామి ప్రజలకు శ్మశానం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అలాగే జేపీ చానెల్ పూడికతీత పనులను త్వరిత గతిన చేపట్టాలని కోరారు. ఈ సమస్యలు తీర్చాలని విజయనగరం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భూ ఆక్రమణను అడ్డుకోండి

మెంటాడ: వాణిజ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.68లో ఉన్న ప్రభుత్వ భూమి, గెడ్డవాగు ఆక్రమణకు గురైందని రైతులు రెడ్డి రాజప్పల నాయుడు, సన్యాసిరావు స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గెడ్డవాగును ఆక్రమించి, కప్పివేయడం వల్ల ఎగువనున్న కొండల నుంచి వచ్చిన వరదనీటి వల్ల తమ పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఆక్రమణలు తొలగించి పంటపొలాలు రక్షించాలని వారు కోరారు.

వైసీపీ అక్రమాలపై విచారణ చేయండి

రేగిడి: మండలంలో వైసీపీ హయాంలో సిమెంట్ విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు దూబ ధర్మారావు తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ ఎల్లారావుకు వారు ఫిర్యాదు అందజేశారు. సచివాలయ భవన నిర్మాణాల్లో దాదాపు 10వేల బస్తాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఒక ఏఈ రాజకీయ ఒత్తిళ్లతో ఆత్మహత్య చేసుకున్నాడని, దీనిపై అప్పట్లో విచారణ జరిగినా వాస్తవాలు రహస్యంగా ఉంచారని చెప్పారు. వీటిని వెలికితీసి సిమెంట్ లెక్కలు బయట పెట్టాలని కోరారు. అలాగే మండల పరిషత్ ప్రాంగణంలో విలువైన చెట్లు అడ్డగోలుగా నరికి సొమ్ము చేసుకున్నారని, మండల పరిషత్‌కు దీనదయాల్ అవార్డు కింద మంజూరు చేసిన రూ.25లక్షల లెక్కలు తేల్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కర్నేన మహేశ్వరరావు, పాలూరి రామినాయుడు, మాజీ జడ్పీటీసీ మంతిన ఉషారాణి, పాలవలస రామచంద్రినాయుడు, గురవాన ధనంజయరావు, శాసపు జనార్దనరావు, గోగల అప్పలనాయుడు, లావేటి సత్యంనాయుడు, కర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వం దృష్టికి వసతిగృహ సమస్యలు

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. విజయనగరంలోని మహారాణిపేట ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, జమ్ములోని జ్యోతిరావు పూలే హాస్టల్, డబుల్ కాలనీలోగల కేజీబీవీ (ఎస్ఎస్ఏ) గర్ల్స్ హాస్టల్‌ను ఆమె సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా తర్వాత వసతిగృహాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని, సమస్యలు మాత్రం పెరుగుతూ వస్తున్నాయని అన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచిత పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. విజయనగరంలోని వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనాలు అందజేస్తున్నారని, ఇంకా నాణ్యత పెరగాల్సి ఉందన్నారు. వసతిగృహాలకు సంబంధించి కొన్ని భవనాలు మరమ్మతులకు గురయ్యాయని, వీటికి బాగుచేసేందుకు ప్రయత్నిస్తామని ఆమె తెలిపారు. వసతిగృహాల అధికారులు కూడా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మహాత్మా.. గోవుల అక్రమ రవాణాను అరికట్టు

- గాంధీ విగ్రహానికి వినతిపత్రం


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర గోసంరక్షణ సమాఖ్య ప్రతినిధులు

జామి: రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా విజయనగరం జిల్లాలో పశువుల అక్రమ రవాణాతో పాటు గోమాంసం విక్రయాలు, గోవధ అధికంగా జరుగుతున్నాయని.. సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు జామి తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం లోగిశ మాట్లాడుతూ కొంతమంది అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి అలమండ సంతకు అనుమతులు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. అవినీతి అధికారులు, సిబ్బంది తీరుపై హైకోర్టులో కేసు వేస్తున్నామని తెలిపారు. కలెక్టర్, ఎస్పీలు స్పందించి అక్రమ రవాణా, కబేళా నిర్వహించే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి పైడితల్లి, కేవీఆర్ సత్యనారాయణ, కోట పైడితల్లి, సింహాద్రి ఆనంద్, నీలాపు దేవి, అంబటి రోజా, జీవనజ్యోతి, మధులత, బొబ్బాది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న న్యాయాధికారిణి వాణి

శృంగవరపుకోట రూరల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేవిధంగా వైద్యులు చూడాలని ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారి సబ్బవరపు వాణి అన్నారు. సోమవారం కొట్టాం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని న్యాయాధికారి ప్రారంభించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను వైద్యాధికారి హారిక.. న్యాయాధికారికి వివరించారు. రోగులకు న్యాయాధికారి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అప్పలనాయుడు, న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, సత్యనారాయణ, న్యాయవాదులు అల్లు సత్యాజీ, త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, డబ్ల్యూఎన్ శర్మ, టీవీఆర్ మూర్తి, అప్పారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ల్యాబ్ ప్రారంభం

లక్కవరపుకోట: సాహసం స్వచ్ఛంద సంస్థ మరో డిజిటల్ ల్యాబ్‌ను ప్రారంభించింది. సోమవారం చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ సంస్థ ఏర్పాటుచేసిన డిజిటల్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే.. సాహసం సంస్థ అధినేత మాచవరపు గణేష్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, ఎంఈవో కూర్మారావు, హెచ్ఎం గోవిందరాజులు పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

విద్యాభివృద్ధే లక్ష్యంగా ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కొండలరావు

గజపతినగరం: విద్యాభివృద్ధే లక్ష్యంగా గ్రామాల్లో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించాలని గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యా విధానాలపై ప్రత్యేకశ్రద్ధ వహించిన వారికి విద్యా కమిటీ ఎన్నికల్లో అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తప్పవని, టీడీపీ నాయకులైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

దత్తిరాజేరు: ఈనెల 8న జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికలలో టీడీపీ తరపున నిలబడే అభ్యర్థులను గెలిపించాలని గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు కోరారు. సోమవారం కోమటిపల్లి వద్ద ఉన్న కల్యాణమండపంలో టీడీపీ నాయకులతో పార్టీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, బెజవాడ బంగారునాయుడు, ఎంపీటీసీ వంగపండు కృష్ణమూర్తినాయుడు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

నెల్లిమర్ల: జరజాపుపేటలో జనసేన పార్టీ 500 క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేసినట్టు ఆ పార్టీ నాయకులు ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, అవనాపు మురళీకృష్ణ, మద్దిల అప్పన్న తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. త్వరలో ఎమ్మెల్యే నాగమాధవిని కలిసి, సభ్యత్వ వివరాలను అందజేస్తామని చెప్పారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలిలో సోమవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసైనికులు చేపట్టారు. జనసేన పార్టీ విధి విధానాలు నచ్చే వారంతా సభ్యత్వానికి ముందుకు రావచ్చని జనసేన నాయకులు తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, దొగ్గ రమణ, సీతంపేట దేముడు కోరారు.

ప్రజా సేవతోనే నాయకులకు గుర్తింపు


వస్త్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చీపురుపల్లి: ప్రజలకు చేసిన సేవల కారణంగానే రాజకీయ నాయకులకు గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, దుర్గామల్లేశ్వర సేవా ట్రస్ట్ చైర్మన్ ముల్లు రమణ పుట్టినరోజు సందర్భంగా చీపురుపల్లిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని, మాట్లాడారు. అనంతరం సుమారు 200మంది పేదలకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమలో పార్టీ నాయకులు దన్నాన రామచంద్రుడు, గద్దే అనురాగ్‌చౌదరి, పైల బలరాం, పారేపాక సురేష్‌బాబు, తెలుగు యువత జిల్లా ప్రతినిధి దాసరి శివప్రసాద్, అడపా సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: చీపురుపల్లిలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయం కోసం పట్టణానికి చెందిన వారణాసి అప్పలరాజు, శారద దంపతులు రూ.50,116 విరాళంగా ఇచ్చారు. సోమవారం వారు ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల: మండలంలోని తంగుడుబిల్లి రూరల్ విద్యుత్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం రామతీర్థం గ్రామ పరిధిలోని దేవునివెలివాడలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అధికారి పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

పైడిమాంబ హుండీ లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: పైడిమాంబ చదురుగుడి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పైడిమాంబ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రామతీర్థం దేవస్థానం ఈవో, పైడిమాంబ దేవస్థానం ఈవో డీవీ ప్రసాద్‌రావు పర్యవేక్షించారు. రూ.7లక్షల78వేల 949తో పాటు బంగారం 19గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 55గ్రాములు, మూడు యూఎస్‌ఏ డాలర్లు వచ్చాయి.

తల్లిపాలు బిడ్డకు వరం

దత్తిరాజేరు: తల్లిపాలు బిడ్డకు వరం లాంటివని కోరపుకొత్తవలస పీహెచ్‌సీ వైద్యురాలు పి.స్రవంతి అన్నారు. పాచలవలస, రామచంద్రపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ డీవీ గిరిబాబు, ఎంపీహెచ్‌ఈవో బి.మురళితో కలిసి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.